హామీల అమలులో కూటమి విఫలం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గోనెగండ్లలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నందవరంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, శివారెడ్డిగౌడ్, విరూపాక్షిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి, ఎంపీపీ కేశన్న, సీనియర్ నాయకుడు సోగనూరు భీమిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి స్వగృహం వద్ద బుధవారం ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే వెన్నుపోటు దినం పోస్టర్లను సర్పంచ్‌లు, పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తమ నేత మాజీ సీఎం వైఎస్ జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథాకాల క్యాలెండర్ ఆవిష్కరించి ఆ మేరకు ఏడాదిలోగా అన్ని పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఎమ్మిగనూరు పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి నిర్వహించే ర్యాలీ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ పోలయ్య, కోటేకల్ సర్పంచ్ లక్ష్మన్న, కడివెళ్ల రంగస్వామి, గుడికల్ భాస్కర్, నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం

నందవరం : సీఎం చంద్రబాబు హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచిన విధానాన్ని ప్రజలకు వివరించేందుకు ఈ నెల 4న ఎమ్మిగనూరులో నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులకు రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం పోస్టర్లను ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, పూలచింత మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, నాయకులు చాంద్‌తాత, మీసాల సంపత్‌గౌడ్, వెంకటరాముడు, చంద్రశేఖర్, పాంపన్న తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 4న పెద్ద ఎత్తున నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ముందుగా దివంగత నేత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేశారు. కేవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం ఆందోళనకు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తాలూకా బీసీ సెల్ అధ్యక్షుడు టీ. మురళీనాయుడు, మండల ఉపాధ్యక్షులు చికెన్ రాజా, అల్లాబకాష్, నాయకులు ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, కాశీవిశ్వనాథ్ రెడ్డి, దొరబాబు, డాక్టర్ శివరాం, ఉరుకుంద రెడ్డి, ఇమ్రాన్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీఎస్సీ మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగం



డీఎస్సీ మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ 2 మధుసూదన్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహించే మోడల్ టెస్ట్ ఎంతో ఉపయోగకరంగా వుంటుందని ఎంఈఓ 2 మధుసూదన్‌రాజు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ధనుంజయలు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ మోడల్ టెస్ట్ నిర్వహించారు. పరీక్ష పేపర్లను ఎంఈఓతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం డీఎస్సీ అభ్యర్థుల నుద్దేశించి వారు మాట్లాడారు. ఉపాధ్యాయ కొలువులు సాధించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్లు మల్లికార్జున, శంకరప్ప, రాజు, నాగేంద్రకుమార్, నబిసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు ఆవరణంలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఎస్ఎస్ ట్యాంకు పరిశీలన



ఎస్ఎస్ఐ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, తదితరులు

ఆదోని టౌన్: మండలంలోని బసాపురం ఎస్ఎస్ ట్యాంకును సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు పరిశీలించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలు తాగునీటి కోసం ఉపయోగించే ప్రాంతం పరిశీలనలో ఎస్ఎస్ ట్యాంకులో నీరు వృథా అవుతున్న స్థితి కనిపిస్తోందన్నారు. రోడ్లపై నీరు వృథాగాకుండా ప్రతిఒక్కరూ నీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, భాస్కర్, ఎరుకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

పెద్దకడబూరు: భార్య, అత్తపై కొడవలితో దాడి చేసిన నిందితుడు ఆలూరు మండలం అంగస్కల్ గ్రామానికి చెందిన వేమారెడ్డి అలియాస్ మద్దికేర నేమిరెడ్డిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కంబదహాల్ గ్రామానికి చెందిన జయంతి, ఆమె తల్లి జయమ్మపై గత శుక్రవారం ఎరుకలి కొడవలితో దాడిచేసి పరారైన వేమారెడ్డి అలియాస్ మద్దికేర నేమిరెడ్డి సోమవారం మండల పరిధిలోని హెచ్.మురవణి నాలుగవ మైలురాయి వద్ద తిరుగుతుండగా కాపుకాచి పట్టుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

ఆదోనిలో ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్

ఆదోని టౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఐకేపీ మెప్మా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ముగ్గుల పోటీలను పర్యవేక్షించారు. పోటీల్లో పొదుపు సంఘాల మహిళలు పాల్గొని తమతమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేసి, వారికి బహుమతులను ఈనెల 21వ తేదీన పంపిణీ చేయడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని చెప్పారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

ఆదోని రూరల్: మండలంలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే వేరుశనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఒక రైతుకు ఎకరాకు ఒక బ్యాగు నుంచి మూడు బ్యాగుల వరకు అందిస్తామన్నారు. రైతులకు కే–6 రకం వేరుశనగకాయలు అందుబాటులో ఉన్నాయని, నేటి నుంచి రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



వృద్ధురాలి సమస్యను వింటున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరావు, డీఎల్‌డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీవుల్లా, డీఎల్‌పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో తెలంగాణ డీసీపీ



డీసీపీ పద్మజ దంపతులకు రాఘవేంద్రుల చిత్రపటాన్ని అందజేస్తున్న వై.ప్రదీప్‌కుమార్ రెడ్డి

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ రాష్ట్రానికి చెందిన డీసీపీ పద్మజ దంపతులు సోమవారం మంత్రాలయం విచ్చేశారు. వారిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. వారితో కలిసి రాత్రి రాఘవేంద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అంతకుముందు గ్రామ దేవత మంచాలమ్మకు హారతులు పట్టి మొక్కుల తీర్చుకున్నారు. అందరూ రాఘవేంద్రుల రథయాత్రల్లో పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం

నందవరం : క్షయ(టీబీ)వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి, టీబీ సూపర్‌వైజర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం –3లో గ్రామ సర్పంచ్ తోట సావిత్రి ఆధ్వర్యంలో వైద్యాధికారుల నేతృత్వంతో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందించే నిక్షయ్ మిత్రులుగా డాక్టర్లు శ్రీలేఖ, రేవతి ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సుశీలబాయి, శ్రీనివాసులు, ఏఎన్ఎం మంజుల, ఎంఎల్‌హెచ్‌పీ మాధవి పాల్గొన్నారు.

గోనెగండ్ల: టీబీ, షుగర్ వ్యాధుగ్రస్తులు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని డాక్టర్ రంగ రవళి, ఎంపీడీఓ మణి మంజరి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని హెచ్. కైరవాడి గ్రామంలోని సచివాలయం–1లో ఆస్పత్రి సిబ్బంది టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ వేణుగోపాల్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విత్తుకు తొందర వద్దు

గోనెగండ్ల : ప్రస్తుతం కురిసిన వర్షాలకు వర్షాధారం కింద సాగు చేస్తున్న రైతులు తొందరపడి విత్తుకోవద్దని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రుతుపవనాలు ప్రవేశించిన తర్వాత నల్ల రేగడి నేలల్లో అయితే 65 నుంచి 75 మిల్లీ మీటర్ల వర్షపాతం, అదే ఎర్రనేలల్లో అయితే 40 నుంచి 55 మిల్లీ మీటర్ల వర్షపాతం వారం లోపు నమోదై, నేల 15 నుంచి 20 సెంటిమీటర్ల లోతు తడిచాకే వర్షాధార పంటలు సాగుచేయాలన్నారు. వర్షాధార పంటలు పత్తి, కంది, ఆముదం, మొక్కజొన్న, పెసలు తదితర పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. అలాగే దళారులు అమ్మే లూజు విత్తనాలు కొనవద్దని, వాటికి నాణ్యత ఉండదని, ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ డీలర్స్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనాలని రైతులకు సూచించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

కౌతాళం: పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ కోరారు. సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తల్లికి వందనం పథకాలు కూడా వర్తిస్తాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

కోసిగి : మండలంలో మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆదోని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మంజునాథ్ తెలిపారు. సోమవారం కోసిగిలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ గదులు, కాంపౌండ్, బాత్‌రూమ్‌లలో దోమల మందును పిచికారీ చేయించారు. ఆరోగ్య విస్తరణ అధికారులు యల్లప్ప, శ్రీనివాసులు, పర్యావేక్షకులు రాముడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు



తాగునీటి బోరును ప్రారంభించిన ఎంపీపీ ఈరన్న, అధికారులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం వీధిలోని కందనాతి మారెమ్మ దేవి ఆలయ సమీపంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో మండల నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ ఈరన్న , వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు ఆధ్వర్యంలో వారు తాగునీటి బోరును పూజలు తాగునీటి సరఫరా ప్రారంభించారు. కడపాళెంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని మండల గ్రాంటు రూ.1.50లక్షలతో తాగునీటి బోరు వేయించినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో 1.20లక్షల స్టోరేజ్ కలిగి ఉండే తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఏఈ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ విభాగం తాలూకా అధ్యక్షుడు నాడుగేని నాగరాజు, వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర నాయకులు వెంకటేష్, లోకా రెడ్డి, నిమ్మయ్య, నాగిరెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో చర్చి ఫాదర్, తదితరులు

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పరిశుద్ధ బాలయేసు మండిగిరి చర్చిలో సోమవారం నిరుద్యోగ యువతీ యువకలుకు జాబ్‌మేళా నిర్వహించారు. గలల జోజప్ప జ్ఞాపకార్థంగా ఈ జాబ్ మేళా నిర్వహించినట్లు ఫాదర్ వెల్లడించారు. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలలో దాదాపు 125 మంది యువతీ, యువకులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువతీ, యువకులకు దాదాపుగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం తెలిపింది. హాజరైన నిరుద్యోగులకు చర్చి ప్రాంగణంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫెవరేట్ ఫాదర్ జార్జ్, టీచర్ అంతయ్య పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని సెంట్రల్: ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సిసిరా దీప్తికి వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు శశిధర్ మాట్లాడుతూ ఆదోని పట్టణంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, సంజయ్, కార్తీక్, జగన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: కౌలు రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న కోరారు. సోమవారం ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి ఎలాంటి పూచికత్తు లేకుండా బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ నాయకులు నరసింహుడు, రాముడు, హనుమంతు, ఐఎఫ్‌టీయు డివిజన్ కార్యదర్శి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కమిషనర్ పర్యటన

ఆదోని టౌన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీ, కాజిగడ్డ, ఎన్‌టీఆర్ నగర్, వెంకటేశ్వర కాలనీల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్‌తో కలిసి పర్యటించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీల్లో మరుగుదొడ్ల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. నీటి సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలన్నారు. కాలనీల్లోని పాత పెద్దకూర, కమేళాలను మార్చాలన్నారు. స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలి

కౌతాళం: ప్రభుత్వం నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాలని, అన్ని రకాల విత్తనాలను సబ్సిడీతో ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు రైతు సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకటేశులు, మల్లయ్య మాట్లాడుతూ రైతులంతా సేద్యం పూర్తి చేసుకుని విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి సబ్సిడీ విత్తనాలను అందించకలేక పోయిందన్నారు. దీంతో రకరకాల కంపెనీల పేర్లతో కొత్త కొత్త పేర్లతో పత్తి విత్తనాలు మార్కెట్‌లో వచ్చాయన్నారు. ఏ విత్తనాలు వేయాలో తెలియక రైతులు షాపుల వారు చెప్పే విత్తనాలు తీసుకుని మోసపోతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అయ్యప్ప, ఈరన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఆదోని రూరల్: ఆదోని ఎమ్మెల్యే పీఏనని తహసీల్దార్‌లను భయపెట్టి మాదాసి కురువ, మాదారి కురువ కుల ధ్రువీకరణ పత్రాలను పొందిన కురువ నాగరాజుగౌడ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, బసాపురం ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి

ఆదోని రూరల్: ఆదోని పరిసర ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గోవులను అక్రమ రవాణాను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని డీఎస్పీ హేమలతకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, నగర అధ్యక్షుడు సాకరే ఈరన్న, తలారి ఆంజనేయులు, మరియాని చెన్నబసప్ప తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తనిఖీ



లారీలో తరలిస్తున్న ఎరువుల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

ఆదోని రూరల్: ఎరువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు వ్యవసాయశాఖ, రెవెన్యూ, రవాణా, పోలీసుశాఖ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపడుతున్నట్లు ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణశివారులోని సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎరువులు, విత్తనాల లోడు లారీల రికార్డులను తనిఖీ చేశారు. చట్టవిరుద్ధంగా ఎరువులు, విత్తనాలు తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య, అధికారులు పాల్గొన్నారు.

వగరూరులో క్షయ వ్యాధి శిబిరం



టీబీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ

మంత్రాలయం రూరల్ : మండలంలోని కల్లుదేవకుంట పీహెచ్‌సీ పరిధిలోని వగరూరు గ్రామంలో క్షయ ముక్త్ భారత్ కార్యక్రమం చేపట్టారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ ఆధ్వర్యంలో అనుమానితులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. మండలంలో టీబీ వ్యాధి గ్రస్తులను పూర్తిగా విముక్తులను చేసేందుకు ప్రత్యేక క్యాంపులు చేపట్టిన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రహమత్, ఏఎన్ఎం అహల్యా తదితరులు పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం

ఆదోని అర్బన్: పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన జనార్దన్ కుమార్తె గీతాంజలి(18) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బంధువులు టూటౌన్ పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. గీతాంజలి ఇంటర్మీడియెట్ చదువుతోంది, కొంతకాలంగా టీబీ వ్యాధితో బాధపడుతుంది, జబ్బు నయంగాకపోవడంతో మనస్థాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బంధువులు ఆమెను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి మహిళ మృతి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని రాయనగర్‌కు చెందిన మతిస్థిమితం లేని గొల్ల హనుమంతమ్మ(65) అనే మహిళ రైలు కింద పడి మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ కె.గోపాల్ సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో ఆదోని–ఇస్వీ రైల్వేస్టేషన్ల మధ్య కి.మీ. నం.497/25–27 అప్‌లైన్ ట్రాక్ మధ్యలో గొల్ల హనుమంతమ్మ రైలు కింద పడి మృతిచెందిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉగ్రవాదం నశించాలి



శాంతి ర్యాలీ చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

మంత్రాలయం రూరల్ : దేశానికి ముప్పుగా మారిన ఉగ్రవాదం పూర్తిగా నశించాలంటూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు శాంతి ర్యాలీ కొనసాగింది. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, సీపీఎం మండల కార్యదర్శులు తిక్కన్న, జయరాజ్ మాట్లాడుతూ భారత దేశానికి హాని కల్పించే ఉగ్రవాదుల నిర్మూలనకు ప్రభుత్వం మరింతగా కృషి చేయాలన్నారు. ఉగ్రవాదుల దాడుల్లో తనువులు చాలించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ర్యాలీలో ఇరు పార్టీల నాయకులు లక్ష్మన్న, గాబ్రెల్, రాజు, అనిల్, ప్రాణేష్, శ్రీనివాసులు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : దేశ సరిహద్దు ప్రాంతాలలో చేపడుతున్న ఉగ్రవాద దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు కే.వెంకటేశ్వర్లు అన్నారు. దేశంలో మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకై సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు సమైఖ్యతా యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శిలు దేవదాసు, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి



ఆదోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి, అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాల నిర్మాణం కోసం కేటాయించి, రూ.5 లక్షలు నిర్మాణానికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ ఆ హామీని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు భీమేష్, వెంకన్న, హర్షద్, రంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ ఆధ్వర్యంలో పట్టణంలో మహిళలతో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు.

మంత్రాలయం రూరల్ : అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతిని అందజేశారు.

నందవరం : సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకి అందజేశారు.

కోసిగి: పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. తహసీల్దారు రుద్రగౌడ్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

కౌతాళం: ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డికి అందజేశారు. సీపీఐ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, మండల కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

పెద్దకడబూరు : సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం నాయకుడు మబ్బు ఆంజనేయ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

మెడికల్ కళాశాల పనులు కొనసాగించాలి

ఆదోని రూరల్: ఆదోని పట్టణ సమీపంలో ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణం పనులను వెంటనే కొనసాగించాలని ఏపీడీఎస్ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, పీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఆదోని మెడికల్ కళాశాల అర్ధాంతరంగా పనులు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం 66 సంవత్సరాలకు లీజుకి ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కళాశాలను కొనసాగించాలని కోరారు.

దివ్యాంగుల పిల్లలకు అడ్మిషన్లు కల్పించాలి

ఆదోని రూరల్: రిజర్వేషన్ ప్రకారం దివ్యాంగుల పిల్లలకు విద్యా సంస్థల్లో అడ్మిషన్లు ఇవ్వాలని దివ్యాంగుల సాధికారత ఫోరం (డీఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ. 2016–వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ రాష్ట్ర, కేంద్ర పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో వికలాంగుల రిజర్వేషన్ ప్రకారం వారి పిల్లలకు అడ్మిషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ నాయకులు నాగరాజు, విశ్వనాథ్, నరసింహులు, రాజశేఖర్, గుడికల్ కేశన్న తదితరులు పాల్గొన్నారు.